క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు అభినందనలు



మంగళగిరి: ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం సేలం పట్టణంలో జరిగిన సౌత్ ఇండియా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మెన్ ఉమెన్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పలువురు పవర్ లిఫ్టర్లు పతకాలు సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధానిలు తెలిపారు. బుధవారం పట్టణంలోని అసోషియేషన్ కార్యాలయంలో పతకాలు సాధించిన వారిని అభినందించి వివరాలు తెలిపారు. 84 కేజీల విభాగంలో బొల్లినేని చంద్రిక సీనియర్ గోల్డ్ మెడల్, స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్, ఎస్‌కె సబీనా 84 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, పి.శ్రావణి సబ్ జూనియర్ విభాగంలో బ్రాంజ్ మెడల్, చాతుర్య జూనియర్ విభాగంలో బ్రాంజ్ మెడల్, వినయశ్రీ జూనియర్ విభాగంలో బ్రాంజ్‌మెడల్, జి.హేమవర్ధన్ సబ్ జూనియర్ విభాగంలో సిల్వర్ మెడల్, జి.నాగగణేష్ సబ్ జూనియర్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించగా అసోషియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు.

ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం



మంగళగిరి: నగర పరిధిలోని ఆటోనగర్‌లో బుధవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షాప్ నెంబర్ 139లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్లాస్టిక్ కావడంతో మంటలు ఎగిసిపడగా వెంటనే అగ్నిమాపక యంత్రం చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలో వివిధ అనారోగ్యాలతో ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు కాగా వాటిని బుధవారం బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు మాట్లాడుతూ దుగ్గిరాల మండలానికి చెందిన నలుగురు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.5.49లక్షలను పంపిణీ చేసినట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు తెనాలి విద్యార్థులు



తెనాలి: బీహార్ రాష్ట్రంలోని గయ పట్టణంలో ఈనెల 29–31 తేదీల్లో జరగనున్న 43వ సబ్ జూనియర్ జాతీయ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్లకు స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టులో 9వ తరగతి విద్యార్థి షేక్ హనీఫ్, బాలికల రాష్ట్ర జట్టులో 9వ తరగతి విద్యార్థిని పెనుమూడి బ్యూల ఎంపికయ్యారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని షేక్ మౌలాబి, వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్‌లు విద్యార్థులను అభినందించారు.

బాల్య వివాహలు వద్దంటూ ర్యాలీ



తెనాలిరూరల్: బాల్య వివాహ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి ఏజెన్సీ ఏపీఎం కె. జయశ్రీ పిలుపునిచ్చారు. బాల్య వివాహ ముక్త్ భారత్‌లో భాగంగా బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని మండలంలోని పెదరావూరు గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ప్యానల్ న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్, పారా లీగల్ వాలంటీర్ చింతయ్య, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ సూపరింటెండెంట్ మహబూబ్ పాల్గొని బాలల హక్కులు, బాల్య వివాహాల గురించిన చట్టాలను వివరించారు. కె. రజని, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొని గ్రామంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

ఆటో ఇటో అయితే..!

ప్రమాదం అంచున ప్రయాణం

- అపరిమిత వేగం.. పరిమితికి మించి ప్రయాణం
- మండలంలో ఆటోలు, ఇతర రవాణా వాహనాల హల్‌చల్
- ప్రమాదకరంగా కూలీలను, విద్యార్థులను తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ఫిరంగిపురంలో ఆటో వెనుక నిలుచుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు



వేములూరిపాడు వద్ద పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న దృశ్యం

ఫిరంగిపురం: ప్రమాదం అని తెలిసినా.. గతంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఉన్నా.. అవేమీ పట్టించుకోకుండా మండలంలో ఆటోలు, ట్రాక్టర్‌లు, మినీలారీల డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను, ప్రయాణికులను, విద్యార్థులను తరలిస్తున్నారు. ఎక్కువమందిని తీసుకెళ్లే ఉద్దేశంతో ఆటోలు, ట్రాక్టర్ల అంచుల్లో సైతం జనాన్ని కూర్చోబెడుతూ ప్రమాదాలను ఆహ్వానిస్తున్నారు.

పరిమితికి మించి...

మండలంలోని పలుగ్రామాలకు పొలం పనులకు కూలీలను తీసుకువెళ్లేందుకు ఆటోలు, ట్రాక్టర్లు, మినిలారీలు వినియోగిస్తున్నారు. పరిమితికి మించి కూలీలను తీసుకు వెళుతున్నారు. పలు వాహనాల డ్రైవర్లు వేగంగా ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సి వస్తుంది. ప్రమాదాలు సంభవిస్తాయని తెలిసినా బతుకు తెరువుకోసం పనులకు కూలీలు ఇరుకు స్థలాల్లో నిలిచి మరీ ప్రయాణిస్తున్నారు.

పొగమంచుతో ప్రమాదాలకు ఆస్కారం..

అసలే శీతాకాలం కావడంతో ఉదయాన్నే పొగ మంచు ఎక్కువగా ఉంటుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంటుంది. అటువంటి పరిస్థితుల్లో ప్రయాణాలు అత్యంత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. వాహనాల డ్రైవర్లు అపరిమిత వేగంతో ప్రయాణిస్తున్నారు. గతంలో పాఠశాల విద్యార్థులను ఆటోలో తీసుకెళ్తున్న సమయంలో మంచుతో రోడ్డు కనిపించక ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా మరికొందరు విద్యార్థులకు తీవ్రగాయాలైన సంఘటన ఫిరంగిపురం వద్ద జరిగింది. అయినా ఖాతరు చేయని ఆటో, మినిలారీల డ్రైవర్లు యథేచ్ఛగా విద్యార్థులను కూలీలను ప్రమాదకరంగా తరలిస్తున్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలు..

మండల కేంద్రంలోని పాఠశాలలకు వివిధ గ్రామాలనుంచి వచ్చే ఆటోల్లో విద్యార్థులను ఎక్కువమందిని తీసుకువస్తున్నారు. కొందరు ఆటో వెనకభాగంలో నిలబడి సర్కస్ ఫీట్లు చేస్తూ మరీ ప్రయాణం చేస్తూ పాఠశాలలకు వస్తున్నారు. ప్రమాదాలు జరుగుతాయని తెలిసీకూడా విద్యార్థుల తల్లిదండ్రులు వాహనాలు లేక గత్యంతరం లేని పరిస్థితిల్లో పంపిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు...

పరిమితికి మించి పలు వాహనాల్లో ప్రయాణికులు, కూలీలను, విద్యార్థులను నిత్యం గుంటూరు - కర్నూలు రాష్ట్ర రహదారిపై తరలిస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు దాదాపు శూన్యమనే చెప్పాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు జరిపి, తగిన చర్యలు తీసుకుంటేనే ఇటువంటి వాటికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు, పలురకాల వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తుందని, శీతాకాలం పొగమంచుతో ప్రమాదాలు సంభవించక ముందే పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణాలకు అడ్డుకట్టవేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నుదురుపాడు వద్ద ఆటోవెనక కూర్చుని ప్రయాణిస్తున్న మహిళలు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



తాడేపల్లిరూరల్: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, భారతదేశం బాల్య వివాహ రహిత దేశం కావాలని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్ర విష్ణు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని కళాశాలలో బాల్యవివాహాలపై అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విష్ణు మాట్లాడుతూ చట్ట ప్రకారం 18 సంవత్సరాలు నిండని అమ్మాయిలకు, 21 సంవత్సరాలు నిండని అబ్బాయిలకు వివాహాలు చేయడం నిషేధమన్నారు. బాల్యవివాహాలు చేయాలని చూస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. చింతలపూడి పంచాయతీ కార్యదర్శి మణికంఠ, సచివాలయ సిబ్బంది, ఎన్‌జీఓ చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ నుంచి సుల్తానా, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంటగల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు అండగా ఉంటాం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



రైతులతో మాట్లాడుతున్న పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తాడేపల్లిరూరల్: వ్యవసాయంలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామని, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మంగళగిరి నియోజకవర్గంలో దుగ్గిరాల, తాడేపల్లి ప్రాంతాల్లోని పలు గ్రామాలో ఆయన వివిధ శాఖ అధికారులతో కలసి పర్యటించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రెండు మూడు రోజుల నుంచి తుఫాను హెచ్చరికలు జారీ చేయడంతో కొంతమంది దళారులు రైతులను మోసగించి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని, రైతులు వారి మాటలు నమ్మవద్దని, రైతు సహాయ కేంద్రాల నుంచి ప్రతి గ్రామంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, 24 గంటల్లో ధాన్యం కొనుగోలు చేసిన నగదును ప్రభుత్వం రైతు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ రైతు సహాయక కేంద్రాల్లో ధాన్యం పరిశీలించేందుకు సిబ్బంది సరిగా రావడం లేదని, తేమశాతం ఎక్కువగా ఉందని, 75 శాతం ధాన్యం బస్తాలను ప్రభుత్వం ప్రకటించిన ధర కన్నా తక్కువకు అమ్ముకున్నామని, ఉన్న 25 శాతం ధాన్యాన్ని అయినా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దళారులు ఎవరైనా రైతులను మోసం చేస్తే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, తాడేపల్లి, దుగ్గిరాల తహసీల్దార్లు సీతారామయ్య, సునీత, తాడేపల్లి ఏఓ ఎ. శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి

నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి ఎం.గంగరాజు



మాట్లాడుతున్న ఎం.గంగరాజు

తాడికొండ: 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి ఎం.గంగరాజు సూచించారు. బుధవారం తాడికొండ మండలం లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి సీఈఓ కార్యాలయం నుంచి వచ్చిన మార్గదర్శకాల మేరకు 18 సంవత్సరాలు నిండినవారు ఫారం–6 అర్జీ దాఖలు చేయాలని సూచించారు. ఇందుకోసం విద్యార్థులు ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్‌వీఎస్‌పీ పోర్టల్ యాప్‌లో ఫారం–6 దరఖాస్తు చేసుకొనే విధానం వివరించారు. ప్రస్తుతం 17 సంవత్సరాలు జరుగుతున్న వారు ప్రాస్పెక్టివ్ ఓటర్స్‌గా పరిగణించబడతారని ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కు దరఖాస్తు చేసుకునేందుకు 2025 జనవరి 28 చివరి తేదీఅని, విద్యార్థులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్ కె.నాసరయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మోహినీ కుమారి, సీఎస్ డీటీ దేవరాజు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నల్లా, ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు, వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రామికవర్గ మహారచయిత గోర్కీ వారసుడు 'బొల్లిముంత'

పోస్టల్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బీవీ రావు



బొల్లిముంత శివరామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి

తెనాలి: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, అభ్యుదయ సినీరచయిత బొల్లిముంత శివరామకృష్ణ శ్రామికవర్గ మహారచయిత మాక్సిం గోర్కీ వారసుడని పోస్టల్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బీవీ రావు అన్నారు. గోర్కీ నవల 'అమ్మ'తో ప్రభావితుడైన శివరామకృష్ణ, అభ్యుదయం ఆశయంగా, శ్రమజీవులు, పేద, బడుగువర్గాల చైతన్యం అజెండాగా ఎంచుకున్నారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలంగా ఉంటూనే ఆ భావజాల వ్యాప్తికి దోహదపడే రచనలను వివిధ ప్రక్రియల్లో చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. బొల్లిముంత శివరామకృష్ణ 104వ జయంతిని బుధవారం సాయంత్రం ఇక్కడి ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, ప్రజానాట్యమండలి, ఇస్కఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు బీవీ రావు అధ్యక్షత వహించారు. మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షుడు తోటకూర వెంకటరమణారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తర్వాత బొల్లిముంతకు సినిమా రంగం ఆహ్వానం పలికిందన్నారు. తనదైన వాడివేడి సంభాషణలతో అనేక సినిమాల విజయానికి ఆయన కారకులైనట్టు చెప్పారు. శారద, శోభన్‌బాబు వంటి నటులు ఆ సినిమాలతోనే సినీరంగంలో స్థిరపడ్డారని వివరించారు. 'అరసం' జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెనహర్ తన ప్రసంగంలో తాను దేన్నయితే నమ్మారో దాన్ని త్రికరణశుద్ధిగా జీవితాంతం ఆచరించిన వ్యక్తి బొల్లిముంత శివరామకృష్ణ అని చెప్పారు. ఆయన రాసిన అందరూ బ్రతకాలి నాటకాన్ని రక్తకన్నీరు నాగభూషణం వంద ప్రదర్శనలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటి సభ్యుడు లోకం భాస్కరరావు తన ప్రసంగంలో కమ్యూనిస్టు ఆదర్శాలతో జీవించటడమే బొల్లిముంతకు మనమిచ్చే నివాళిగా చెప్పారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ఇస్కఫ్ నాయకురాలు బెజ్జంకి నాగమణి తమ ప్రసంగాల్లో బొల్లిముంతతో తమకు గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. ప్రజానాట్యమండలి అధ్యక్షుడు మాణిక్యాలరావు, కళాసమితి అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడారు. సభకుముందు రంగిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. బెల్లంకొండ వెంకట్, అలపర్తి వెంకటేశ్వరరావు, నీలాంబరం, బెన్‌హర్, విజయ్‌లు అభ్యుదయ గేయాలను ఆలపించారు. సభానంతరం బొల్లిముంత రచన 'సంభవామి యుగే యుగే' నాటికను ప్రదర్శించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

తెనాలిఅర్బన్: క్రీస్తు బోధనలు అనుసరణీయమని చిల్డ్రన్స్ యూత్ అధ్యక్షుడు గుండపోగు సాయిరామ్, టీడీపీ నాయకుడు సుద్దపల్లి నాగరాజు పేర్కొన్నారు. ఇందిరానగర్ కాలనీలో మంగళవారం రాత్రి సెమి క్రిస్మస్ వేడుకల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు జననానికి గుర్తుగా నక్షత్రాన్ని అందరూ ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం చిల్డ్రన్స్ యూత్ ఏర్పాటు చేసిన భారీ స్టార్‌ను వారు ఆవిష్కరించారు. అలాగే కేక్ కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేఆర్ అధ్యక్షుడు మేకల సురేష్, టీడీపీ పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు అత్తోట శరత్, చంద్ర వినయ్, సిద్దెల కమలాకర్, కాకర్లమూడి నవీన్, కాకర్లమూడి చిరంజీవి, విజయ్‌కుమార్, జమ్ము సతీష్, మంచాల మనోజ్, ఎస్.కె. ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

తెనాలిరూరల్: టీ దుకాణం నిర్వహించే మహిళపై దాడి చేసి బెదిరించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేటకు చెందిన నాగిశెట్టి రాధ, జిలాని దంపతులు మార్కెట్ ఏరియాలో ప్రతిరోజు తెల్లవారుజామున దుకాణం నిర్వహిస్తుంటారు. బుధవారం దుకానం తెరచిన కొద్దిసేపటికే మారిస్‌పేటకే చెందిన షేక్ కమల్ వీరి బండి వద్దకు వచ్చి అద్దాలను పగులగొట్టి, రాధపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. మండలంలోని కొలకలూరుకు చెందిన విలేకరి నూతక్కి అచ్యుతాచారి మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అదే గ్రామానికి చెందిన పొన్నెకంటి రమేష్ వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు బుధవారం నమోదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ సీహెచ్. ప్రతాప్‌కుమార్ తమ సిబ్బందితో బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 24 వేలు స్వాధీనపర్చుకున్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి వున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం కార్తిక బహుళ ద్వాదశిని పురస్కరించుకుని సామూహిక రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వ్రతం ఆచరించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు అర్చక బృందం పూజలు నిర్వహించారు. దేవతి భగవన్నారాయణ, పద్మజ దంపతులు వ్రతంలో పాల్గొన్న భక్తులకు పూజా ద్రవ్యాలు సమర్పించి, అన్నప్రసాదం వితరణ చేశారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

నష్ట పరిహారం వచ్చేవరకు భూములను వదలం

ప్రతిన బూనిన ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు



ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లిరూరల్: తమకు న్యాయంగా రావలసిన నష్టపరిహారం వచ్చేదాకా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ భూములను వదలమని కార్మికులు బుధవారం ప్రతిజ్ఞ నిర్వహించారు. తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడుతూ పట్టుదలతో కార్మికులు పోరాటం సాగించాలని, మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి ఎన్నికల ముందు ఇచ్చి వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కె.స్టీవెన్, అంకయ్య, ఆశీర్వాదం, సూర్య ప్రకాష్, రమాదేవి, సాంబయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇస్మాయిల్, గురవయ్య, సామ్రాజ్యం, కె.ఆదినారాయణ, నరసింహారావు, రహమతుల్లా పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల మధ్య వివాదం

ఆరోగ్యాధికారిణిపై దురుసుగా ప్రవర్తించిన కమిషనర్

తెనాలిఅర్బన్: మున్సిపల్ అధికారుల మధ్య వివాదం జరిగిందనే ప్రచారం పట్టణంలో జరిగింది. ఆరోగ్యాధికారిణిపై మున్సిపల్ కమిషనర్ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణ కలకలం రేపింది. వివరాలోకి వెళ్ళితే కంపోస్టు యార్డును పరిశీలించేందుకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల వెళ్ళారు. అక్కడ ఘన వ్యర్థాల నిర్వహణ విషయంలో అధికారుల అలసత్వాన్ని కమిషనర్ ప్రశ్నించే క్రమంలో ఆరోగ్యాధికారిణిపై దురుసుగా ప్రవర్తించినట్లు ప్రచారం జరిగింది. మున్సిపల్ అధికారిగా ఘన వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేయడం జరిగిందని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఎవరి పట్ల దురుసుగా వ్యవహరించలేదని చెప్పారు.

ఢీకొట్టి... ఆపై దౌర్జన్యం

తెనాలిరూరల్: ప్రైవేటు వైద్యశాల సిబ్బంది విలేకరిని ఢీ కొట్టడమే కాకుండ, అడిగిన వారిని చేతనైంది చేసుకోండంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన విలేకరి ప్రకాశరావు బుధవారం తెనాలి పాత ప్రైవేటు వైద్యశాల వద్ద తన బైక్‌పై వెళుతుండగా, వైద్యశాల ఆవరణ ఎదురు రోడ్డులో ఉండే ప్రైవేటు వైద్యశాల సిబ్బంది ఒకరు ఢీ కొట్టడంతో ఆయన కింద పడ్డాడు. సమీపంలోని దుకాణంలోనే ఉన్న ఓ జర్నలిస్టు గమనించి కిందపడిన ప్రకాశరావును లేపి జాగ్రత్తగా రావాలిగా అని వైద్యశాల సిబ్బందితో అన్నాడు. అయితే ఘటనకు కారకుడైన యువకుడు, సదరు ప్రైవేటు వైద్యశాల సిబ్బంది అందరూ కలసి విలేకరులపై దౌర్జన్యం చేయడమే కాకుండా ఏం చేస్తారో చేసుకోండని బెదిరింపులకు పాల్పడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ మహిళా మంత్రి బంధువుల వైద్యశాల సిబ్బందే ఇలా ప్రజలపై దౌర్జన్యానికి పాల్పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

రోడ్లపై ఆక్రమణలు తొలగించండి



తెనాలిఅర్బన్: రోడ్లు, మురుగు కాల్వలపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 28వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మురుగు కాల్వలను ప్రతి రోజు బాగు చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికి వెళ్ళి వ్యర్థాలను సేకరించాలన్నారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వివిఎం.లక్ష్మీపతి, కౌన్సిలర్ యాతాటి అనిల్, డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్, పలువురు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.